ప్రజాశక్తి

మంగళవారం 23 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం పార్వతీపురం మన్యం

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మన్యం జిల్లా కలెక్టర్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విజయనగరం ఉమ్మడి జిల్లాలో బాలికలే పైచేయిగా నిలిచారు. పార్వతీపురం మన్యం జిల్లా 96.37 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. విజయనగరం జిల్లా 91.82శాతం ఉత్తీర్ణతతో ఐదో స్థానం సాధించింది. పార్వతీపురం మన్యంలో 96 పాఠశాలలు, విజయనగరం జిల్లాలో 139 ప్రభుత్వ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

జ్యోత్స్న (595)



కార్తీక్ (594)

గౌతమి(591)

టెన్త్ ఫలితాల్లో మన్యం జిల్లా 1

- 96.37 శాతం ఉత్తీర్ణత
- 91.82 శాతంతో విజయనగరం జిల్లాకు 5 వ స్థానం
- ఉమ్మడి జిల్లాలో 235 పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు
- బాలికలదే పైచేయి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్/విజయనగరం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా గత ఏడాది కూడా 87.47 శాతంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. తాజాగా జిల్లాలో 210 పాఠశాలలకు గాను 96 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఏడాది జిల్లాలో 10443మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 10064 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 4861 మంది బాలురు, 5203 మంది బాలికలు ఉన్నారు. 8955 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలోను, 854 మంది ద్వితీయ స్థానంలోనూ, 255 మంది తతీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు. పార్వతీపురంలోని టిఆర్ఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థి కెవి గౌతమి 591 మార్కులతో జిల్లాలో టాపర్‌గా నిలిచింది. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో జిల్లాను నిలిపిన విద్యాశాధికారి జి.పడగాలమ్మను, ఉపాధ్యాయులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. తనకు మొదటి ర్యాంక్ వచ్చినంత ఆనందంగా ఉందని, ఈ ఫలితాలు గొప్ప సంతృప్తినిచ్చాయని పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారకులైన జిల్లా ఉన్నతా అధికారులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బందికి, తల్లిదండ్రులకు డిఇఒ కృతజ్ఞతలు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం మే 24 నుంచి జూన్ 3 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, సంబంధిత పాఠశాలలో ఈనెల 23 నుండి 30 వరకూ ఫీజులు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

విజయనగరం జిల్లా గత ఏడాది కంటే మెరుగైన (మిగతా..3లో)

గత పదేళ్లలో ఫలితాలు

ఉమ్మడి జిల్లా	శాతం
2014-15	92.99 శాతం
2015-16	92.47 శాతం
2016-.17	93.36 శాతం
2017-18	96.01 శాతం
2018-19	97.28 శాతం
కరోనా సంవత్సరం	
2019-20	100 శాతం
2020-21	100 శాతం
జిల్లా విభజన తర్వాత..	
2021-22	77.50 శాతం
2022-23	76.60 శాతం
2023-24	91.82 శాతం
మన్యం జిల్లా	
2022-23	87.47 శాతం
2023-24	96.37 శాతం

- భీమసింగిపైనా ఆలోచిస్తా..
- ఐటి టవర్‌తో వర్ ఫ్రమ్ హోం
- ఉత్తరాంధ్రలో రూ.40 వేల కోట్ల ఆస్తిని జగన్ దోచేశాడు
- ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
- ప్రజాగళం సభలో చంద్రబాబు

టిడిపి శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

శృంగవరపుకోటను విశాఖలో విలీనం చేస్తాం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి, ఎస్‌కోట

కూటమి అధికారంలోకి వస్తే ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే విషయాన్ని కూడా ఆలోచిస్తామని చెప్పారు. విశాఖను అభివృద్ధి చేసినట్లే ఎస్‌కోటను కూడా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎస్.కోటలోని దేవిబొమ్మ జంక్షన్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. ఎస్‌కోటలో ఐటి టవర్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కొత్తవలసలో డిగ్రీ కాలేజీ నిర్మాణం, పుణ్యగిరిని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఉత్తరాంధ్రలో రూ.40వేల కోట్ల ఆస్తిని జగన్ దోచేశాడని, ప్రజా ధనం రూ.500 కోట్లతో రిషికొండను తవ్వేసి భవంతులు కట్టాడని, అటువంటి వ్యక్తికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అతని బంగ్లాలు కట్టుకుని పేదలకు శ్మశానాలు, చెరువుల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకున్నాడన్నారు. ప్రమాదకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చి ప్రజల ఆస్తులను దోచేసే కార్యక్రమానికి (మిగతా..3లో)

పోలవరం నీరు ఉత్తరాంధ్రకు

ఉత్తరాంధ్ర ప్రజలకు తాగు, సాగునీటి కోసం పోలవరం ద్వారా వస్తున్న నీటిని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా రైతులకు అందిద్దామని ఆ ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు గుర్తు చేశారు. అయితే జగన్ ఈ ఐదేళ్లలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పట్టించుకోలేదని, దీంతో ఇక్కడ రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాను అధికారంలోకి రాగానే పోలవరం నీటిని సుజల స్రవంతి ద్వారా రైతులకు అందిస్తామని చెప్పారు.

అధినేతల రాకతో వేడెక్కుతున్న రాజకీయం

- జిల్లాకు చేరిన చంద్రబాబు
- నేడు జగన్, రేపు పవన్ రాక
- రసవత్తరంగా మారిన ఎన్నికల ప్రచారం
- అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న వైసిపి, కూటమి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వివిధ పార్టీల అధినేతల రాకతో జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రచారం నువ్వా? నేనా? అన్నట్టుగా ఊపందుకుంటోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలతోపాటు ఇతరులు కూడా స్వంతంత్ర్య అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వారంతా ప్రచార పర్వంలో మునిగితేలుతున్నారు. ఈనేపథ్యంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వచ్చారు. మంగళవారం గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని బొండపల్లిలో మహిళా ప్రజాగళం సభలో పాల్గొననున్నారు. ఉదయం 11:30గంటలకు బహిరంగ సభ జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా జరిగాయి. అదే రోజు సాయంత్రం 4గంటలకు వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయనగరం రానున్నారు. చెల్లూరు వద్ద తలపెట్టిన సిద్ధం సభలో పాల్గొంటారు. బుధవారం కూడా జిల్లాలో పార్టీ ప్రచారం కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాల్లో చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు. మూడు రోజులపాటు మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ప్రధాన నేతల పర్యటన జరగనుండడంతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా (మిగతా..3లో)

నాలుగో రోజు

30 నామినేషన్లు

విజయనగరం జిల్లాలో లోక్‌సభకు-3 , అసెంబ్లీకి 18

మన్యంలో అరకు స్థానానికి 5, అసెంబ్లీ స్థానాలకు 4

ప్రజాశక్తి-విజయనగరం కోట/పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండు పార్లమెంట్, 11 అసెంబ్లీ స్థానాలకు నాలుగో రోజు సోమవారం మొత్తంగా 30 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయనగరం పార్లమెంటు స్థానానికి ముగ్గురు, అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 18 మంది నామినేషన్లను దాఖలు చేశారు. విజయనగరం ఎంపి స్థానానికి వైసిపి అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ నామినేషన్ వేశారు. నియోజకవర్గ ఆర్ఒ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అరకు పార్లమెంటు నియోజకవర్గానికి ఐదుగురు నామినేషన్ వేశారు. వారిలో బిజెపి అభ్యర్థిగా కొత్తపల్లి గీత ఉన్నారు.

నామినేషన్ వేస్తున్న వైసిపి ఎంపి అభ్యర్థి బెల్లాన

విజయనగరం ఎంపి స్థానానికి వైసిపి అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ నామినేషన్ వేశారు. ఆయన నియోజకవర్గ (మిగతా..3లో)

సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొండపల్లి శ్రీనివాసరావు

నేడు మహిళా గళం సభ

ప్రజాశక్తి - బొండపల్లి

బొండపల్లిలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే 'మహిళా ప్రజా గళం' బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సోమవారం సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యే మహిళా ప్రజాగళం సభకు వేలాదిగా మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జీతాలు ఇవ్వకుంటే ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి బకాయి వేతనాలు, మార్చి నెల వేతనం మే నెల 5 లోగా చెల్లించకుంటే ఆందోళనకు దిగుతామని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. సోమవారు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ ప్రసన్నవాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ ఏడాది జనవరి నెలకు ఇవ్వాల్సిన వెయ్యి రూపాయలు కూడా ఇంతవరకు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అధికారుల నిర్వాకం వల్లనే వేతనాలు చెల్లించడంలో జాప్యం జరిగిందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ టి.ఇందు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విద్యాసాగర్ నామినేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా మరిపి విద్యాసాగర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. తమ మద్దతుదారులతో విద్యాసాగర్ ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని, నామినేషన్ పత్రాలను ఆర్ఒ సాయిశ్రీకి అందజేశారు. బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన విద్యాసాగర్‌కు టికెట్ రావడంతో బాడంగి మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యా సాగర్ అనేక సామాజిక కార్యక్రమాలు చేశారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు బి.పి.ఎ.రాజు ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ పి.బాలభాస్కరరావు హాజరయ్యారు. తొలుత వార్షిక నివేదిక, ఏడాదిలో విద్యార్థుల అనుభవాలు, లోటుపాట్లు తదితర అంశాలపై చర్చాగోష్టి, తరగతుల వారీ ఉత్తమ విద్యార్థుల ప్రకటన నిర్వహించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ప్రదర్శించారు. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

పాల్తేరు కార్యదర్శిని తొలగించాలి

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని పాల్తేరు పంచాయతీ కార్యదర్శి భవానిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని సిఐటియు నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐదారు నెలలపాటు ఎలాంటి కారణమూ, అనుమతీ లేకుండా కార్యదర్శి విధులకు డుమ్మా కొట్టారని తెలిపారు. ఈ విషయమై గతంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి దృష్టికి తీసుకెళ్తే, కార్యదర్శికి మెమోలు ఇచ్చామని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని చెప్పారని గుర్తుచేశారు. అధికారులు ఇప్పుడు ఎలా ఉద్యోగానికి మళ్లీ అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

పది ఫలితాల్లో మెరిసిన విద్యా కుసుమాలు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారు. మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 386 మందికి గాను 364 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. కెజిపూడి జిటిడబ్ల్యుఎఎస్, బక్కునాయుడుపేట మోడల్ స్కూల్, వావిలపాడు పాఠశాల విద్యార్థులు శతశాతం ఉతీర్ణులయ్యారు. మోడల్ స్కూల్ విద్యార్థి ఎం.యామిని 586, ఉల్లి ఎర్నాయుడు 582 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు సిబ్బంది అభినందించారు. కెజిబివి విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారు అభినందించారు.

రామభద్రపురం : పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలో ఏడు ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రయివేటు పాఠశాల నుంచి 465 మంది పరీక్షలు రాయగా వీరిలో 418 ఉత్తీర్ణులయ్యారు. 89.89 ఉత్తీర్ణత శాతాన్ని సాధించినట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. పాతరేగ, బూసాయవలస ఉన్నత పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కొట్టక్కి జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి సిహెచ్ శ్యామ్‌సిరి 580 మార్కులు సాధించారు.

కొత్తవలస : మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. కెజిబివిలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

మెంటాడ : మెంటాడ హైస్కూల్ విద్యార్థి రొంగళి ప్రవల్లిక పదో తరగతిలో 581 మార్కులు సాధించింది. చల్లపేట హైస్కూల్ విద్యార్థి కూనిబిల్లి నరేష్ 574, మోడల్ స్కూల్ విద్యార్థిని ఎ.నిఖిల 571మార్కులు పొందారు. జయతి, జిటిపేట హైస్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఆంధ్ర ఆశ్రమ పాఠశాల 61 శాతంతో అతితక్కువ ఉత్తీర్ణత సాధించింది.

తెర్లాం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గౌతమి స్కూల్ విద్యార్థి ఆర్.వర్షిత 579 మార్కులు, మోడల్ స్కూల్ విద్యార్థి పల్ల యామిని 576 మార్కులు, నందబలగ హైస్కూలు విద్యార్థి బేత జగదీష్ 575 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్, వెలగవలస హైస్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి, వెలగవలస ప్రధానోపాధ్యా యులు జెబి ధనుంజయరాజును ఎంఇఒ త్రినాధరావు అభినందించారు.

గంట్యాడ : మదనాపురం మోడల్ పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. బోయి వనిత 584, రాజాన బాల సరస్వతి 578 మార్కులు పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చిరువ్యాపారి కుమారుడికి 585 మార్కులు

బాడంగి : మండలంలోని ముగడ గ్రామానికి చెందిన చిరువ్యాపారి కుమారుడు మాసాబత్తుల జైగణేష్ పదో తరగతిలో 585 మార్కులు సాధించాడు. జైగణేష్ బాడంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యశించాడు. బాడంగికి చెందిన వ్యవసాయ కూలీ కుమారుడు మరడాన శివ 578 మార్కులు పొందాడు. వీరిని హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

శృంగవరపుకోట : మండలంలోని తాటిపూడి వద్ద ఉన్న గురుకుల పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో టి.కావ్యశ్రీ 580, బి.హాసిని 579, బి.తులసి 578 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్ జె.ఎన్.సంధ్య భార్గవి అభి నందించారు. కొట్టాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. జి.పూజిత 580 మార్కులు సాధించి, సత్తాచాటింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం పెంట విజయరామ కుమార్ అభినందించారు.

ఆరు పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణత

రేగిడి: మండలంలో 12 ఉన్నత పాఠశాలలతో పాటు ఒక కస్తూరిభా గాంధీ పాఠశాల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం వచ్చిన పది ఫలితాల్లో ఆరు ఉన్నత పాఠశాలలు శతశాతం సాధించినట్లు ఎంఇఒ ఎం వరప్రసాదరావు తెలిపారు. అంబకండి, కాగితాపల్లి, కోడిస, సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎపి ఆర్ఎస్‌డబ్ల్యు ఉంగరాడమెట్ట పాఠశాలలు శతశాతం ఉతీర్ణత సాధించాయి. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యా యులు అభినందించారు. మండలంలో 96.7శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

నెల్లిమర్ల: విద్యార్థులను అభినందస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల : పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. జరజాపుపేట, మొయిద, కొండ వెలగాడ, పారశాం జెడ్‌పి పాఠశాలలు, సతివాడ మోడల్ పాఠశాల, ఎంజెపి బిసి గురుకుల పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. కొండ గుంపాం జెడ్‌పి ఉన్నత పాఠశాల 96శాతం, అలుగోలు, సారిపల్లి, రామతీర్థం ఉన్నత పాఠశాలలు 95శాతం, బొప్పడాం 93శాతం, సతివాడ, తంగుడుబిల్లి ఉన్నత పాఠశాలలు 90శాతం, కెజిబివి 89 శాతం, బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల 87శాతం, స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాల 82శాతం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల78శాతం ఉత్తీర్ణత సాధించాయి. సతివాడ మోడల్ పాఠశాలకు చెందిన జి. ఈశ్వర్ కార్తీక్ 594, బొప్పడాం ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్ దుర్గాదీక్షిత 591, ఎంజెపి బిసి గురుకుల పాఠశాలకు చెందిన కె.ధరణి 585 అత్యధిక మార్కులు సాధించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలం మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలలు 92శాతం ఉత్తీర్ణత సాధించాయి.

జామిలో 96శాతం ఉత్తీర్ణత

జామి : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో 470 మంది పరీక్ష రాయగా, 447 మంది పాసయ్యారు. కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.యస్విత 589 మార్కులు సాధించింది. గతం కన్నా విద్యార్థుల ప్రతిభ పెరిగిందని ఉపాధ్యాయులు, అధికారులు కొనియాడారు.

డెంకాడ: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 90 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలో 681 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 613 మంది విజయం సాధించారు. మండలంలోని నేషనల్ పాఠశాల, భవాని పాఠశాలలు శతశాతం సాధించాయి. అక్కివరం మోడల్ స్కూల్ విద్యార్థి పతివాడ సాయికుమార్ 576 మార్కులతో మొదట స్థానం సాధించాడు. రెండవ స్థానంలో పెదతాడివాడ విద్యార్థి బి. సిరి 572 మార్కులు, జొన్నాడ విద్యార్థి ఎన్ హిందూ 571 మార్కులతో మూడో స్థానం సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరినీ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 81 మంది విద్యార్థులకు గాను 78 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దాడ రమణమ్మ తెలిపారు. ఇదే పాఠశాలలో చదివిన వంగర గ్రామానికి చెందిన పాలవలస యామిని 585 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలవడంతో ఆ విద్యార్థినికి హెచ్ఎం రమణమ్మతో పాటు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు మిఠాయిలు తినిపించి అభినందించారు.

గుర్ల: పదోవతరగతి ఫలితాలలో బాలికలు పైచేయి సాధించారని ఎంఇఒ భానుప్రకాశ్ తెలిపారు. మండలంలో పాలవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన సారిక యశశ్వత 575 మార్కులు సాధించి ప్రథమ స్తానం సాధించారు. గుర్ల ఉన్నత పాఠశాలకు చెందిన డి.శ్యామ్ 574 మార్కులతో ద్వితీయస్థానం సాధించారు. మండలంలో కేజిబివి హైస్కూల్ శతశాతం ఉత్తీర్ణత సాధించింది. మండలం మొత్తం 13 హైస్కూల్‌లో 91 శాతం ఉత్తీర్ణత సాధించి నట్లు ఎంఇఒ తెలిపారు. 642 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 584 మంది ఉత్తర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించిన 'పోలిపల్లి'

భోగాపురం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని పోలిపల్లి ఉన్నత పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించింది. 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరతో పాటు మిగతా ఉపాధ్యాయులంతా విద్యార్థులను అభినందించారు. మోడల్ స్కూల్‌లో చదువుతున్న లంకా భావన 588 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రయివేటు పాఠశాలల్లో భోగాపురం గ్రామానికి చెందిన శ్రీ సాయినారాయణ హై స్కూల్, సవరవిల్లిలోని విజ్ఞాన భారతి హైస్కూల్ శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

పట్టించుకోని మోడల్ స్కూల్ సిబ్బంది

మోడల్ స్కూల్లో చదువుతున్న చాకి వలస గ్రామానికి చెందిన లంక భావన 588 మార్కులతో మండల స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కానీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాని, సిబ్బంది గాని కనీసం పట్టించుకోలేదు. పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరంలోనే చాకివలస గ్రామం ఉన్నప్పటికీ ఆ బాలికను పిలిపించి కనీసం శుభాకాంక్షలు కూడా తెలియజేయలేదు. చివరకు మండల విద్యాశాఖ అధికారులు తల్లితో సహా బాలికను కార్యాలయానికి పిలిపించి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు.

మెరక ముడిదాం: పదో తరగతి ఫలితాల్లో గర్భాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు మండలంలోనే సత్తా చాటారు. ఈ పాఠశాల విద్యార్థి గుడివాడ సరస్వతి 589 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన కొప్పల నీలేష్ 586, రెడ్డి యాగ్నేశ్వరి 578, జి. శివరాం చౌదరీ 575 మార్కులు సాధించి మండలంలోని మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ పాఠశాల నుంచి 90 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత చెందారు. బైరిపురం, మెరకముడిదాం, ఉత్తరావిల్లి, కెజిబివి, బుధరాయవలస పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

మండల టాపర్‌గా బాలికల ఉన్నత పాఠశాల

చీపురుపల్లి: టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. చీపురుపల్లి పట్టణంలో గల బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.గీతిక 583 మార్కులతో మండలంలోనే టాపర్‌గా నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన బి నలిని 580 మార్కులు సాధించింది. చీపురుపల్లి గురుకుల పాఠశాల శత శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఈ పాఠశాలకు చెందిన మల్లాపు గుణప్రియ 552 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు అభినందించాయి.

గురుకులంలో నూరు శాతం ఉత్తీర్ణత

బొబ్బిలి : గురుకుల పాఠశాలలో టెన్త్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కె.వరుణ్ 592, ఎం.హర్షవర్ధన్ 591, కె.రాకేష్ 590 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. 500 మార్కులు దాటి 65 మంది సాధించినట్లు ప్రిన్సిపల్ రఘునాథ్ చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సిఎం సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సిఎం జగన్ మోహన్ రెడ్డి సభను జయప్రదం చేయాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ 23 చెల్లూరు వద్ద నిర్వహించనున్న సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయం కన్వీనర్లు, బూత్ కన్వీనర్ల, వార్డు మెంబర్లు, సోషల్ మీడియా సభ్యులంతా మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభకు తరలి రావాలని కోరారు.

ఎన్‌సిసి అధికారుల ఎంపికకు విసికి ఆహ్వానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అసోసియేట్ ఎన్‌సిసి అధికారుల ఎంపిక కార్యక్రమానికి అధ్యక్షత వహించాల్సిందిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతికి ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కమోడోర్ అరవింద్ నగర్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్ ఆహ్వానం పలికారు. సోమవారం విశ్వవిద్యాలయానికి వచ్చిన వారిద్దరూ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సిసి కేర్ టేకర్లుగా పనిచేస్తొన్న అధికారులకు అసోసియేట్ ఎన్‌సిసి అధికారులుగా ఎంపిక చేయాల్సి ఉందన్నారు.

మొదటిపేజీ తరువాయి

టెన్త్ ఫలితాల్లో మన్యం జిల్లా ఫస్ట్

ఫలితాలు సాధించింది. గత ఏడాది 76.66 శాతం ఫలితాలతో రాష్ట్రంలో 7 వ స్థానంలో నిలవగా ఈ ఏడాది ఐదోస్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 23,690 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 21752 మంది ఉత్తీర్ణులై 91.72 శాతం ఫలితాలు సాధించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సరాసరి 15 శాతం ఫలితాలు శాతం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం పరీక్ష రాసిన విద్యార్థుల్లో బాలురు 11868 మందికిగాను 10671 మంది ఉత్తీర్ణులై 89.91 శాతం ఫలితాలు సాధించారు. బాలికలు మొత్తం 11822 మంది హాజరు కాగా వారిలో11081 మంది ఉత్తీర్ణులై 93.73 శాతం ఫలితాలు సాధించారు.

139 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు

జిల్లాలో 139 స్కూళ్లు 100 శాతం ఫలితాలు సాధించాయి. వాటిలో ఎపి మోడల్ స్కూల్స్ 6, ఎపి గురుకులాలు 2,సాంఘిక సంక్షేమ గురుకులాలు 2, బిసి గురుకులాలు 5, కెజిబివి 11, జెడ్‌పిహైస్కూల్స్ 32, ప్రైవేటు స్కూల్స్ 78, గిరిజన గురుకులాలు 3 ఉన్నాయి.

నాలుగో రోజు 30 నామినేషన్లు

ఆర్ఒ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. అదే పార్టీ తరపున బెల్లాన వంశీకృష్ణ కూడా రెండుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సియ్యాదుల ఎల్లారావు నామినేషన్ వేశారు.

అసెంబ్లీ స్థానాలకు సంబంధించి విజయనగరం నియోజకవర్గంలో అఖిల భారతీయ జనసంఘ్ పార్టీ తరపున పోలిపల్లి కిరణ్‌కుమార్, సమాజ్‌వాదీ పార్టీ తరపున పెనుమత్స కరుణాకర్, స్వతంత్ర అభ్యర్థిగా పడాల ఆదినారాయణ నామినేషన్ వేశారు. గజపతిగరంలో స్వతంత్ర అభ్యర్థిగా జి.కూర్మినాయుడు, నవభారత నిర్మాణ సేవా పార్టీ నుంచి కె.గౌరినాయుడు నామినేషన్ వేశారు. ఎస్.కోట నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా వారాది చిరంజీవి, కొట్యాడ లోకాభిరామకోటి, కొట్యాడ రమాదేవి, భాస్కరభట్ల పుష్పలత, వైసిపి తరపున బి.అప్పలనాయుడు నామనేషన్లు వేశారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలో బిఎస్‌పి అభ్యర్థిగా ఎరుకొండ తేజారాణి, రీఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున అదపాక సూరిబాబు, సమాజ్‌వాదీ తరపున కర్రి చిన్నారి, అదే పార్టీ తరపున కర్రి కృష్ణ, జనసేన పార్టీ తరపున లోకం నాగమాధవి నామినేషన్ వేశారు. రాజాం నియోజకవర్గంలో బిఎస్‌పి నుంచి బొచ్చ బుద్దుడు, బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి తరపున వికెఎస్ కష్ణ రంగారావు(బేబినాయన), కాంగ్రెస్ అభ్యర్థిగా మరిపి విద్యాసాగర్ నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఆర్ఒలకు అందజేశారు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

పార్వతీపురం మన్యంలో...

పార్వతీపురం మన్యంజిల్లాలో అరకు పార్లమెంటు నియోజకవర్గానికి బిజెపి అభ్యర్థిగా కొత్తపల్లి గీత నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సమర్థి భవాని, బిఎస్‌పి అభ్యర్థిగా వరం ఆవశ్య లహరి, కంగల బాలుదొర, జిడిపి పార్టీ అభ్యర్థిగా బిడ్డిక రామారావు తమ నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్‌కు అందజేశారు.మ

ఇక పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో కుప్పిలి వెంకట రమణ బహుజన సమాజ్ వాది పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కె.హేమలత కు సమర్పించారు. కురుపాం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ అడ్డాకుల గీతారాణి, కురుపాం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా తోయిక జగదీశ్వరి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వివి రమణకు దాఖలు చేశారు. పాలకొండ నియోజక వర్గం నుండి గోండ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థిగా బిడ్డిక ఉమామహేశ్వరరావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కల్పనా కుమారికి సమర్పించారు. సాలూరు శాసన సభ నియోజక వర్గంలో నామినేషన్లు దాఖలు కాలేదు.

అధినేతల రాకతో వేడెక్కుతున్న రాజకీయం

వేడెక్కింది. ఆయా పార్టీ నేతలంతా తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. రెండు గ్రూపులు కలిసినప్పటికీ అంతర్గత విభేదాలు ఇంకా సమసిపోకపోవడంతో ఎస్.కోటలో చంద్రబాబు పర్యటించారు. రాత్రికి కూడా బసచేసి మరీ నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో చర్చలు జరిపారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్ధేశం చేశారు. గజపతినగరంలో కొండపల్లి శ్రీనివాస్ కొత్త అభ్యర్థికావడం, మాజీ ఎమ్మెల్యే అలకబూని అసమ్మతిరాగం తీయడంతో గజపతినగరంపైనా బాబు దృష్టిసారించారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు సిద్ధం సభలో జగన్ సమక్షంలో వైసిపిలో చేరనున్నారు.విజయనగరంలో వైసిపి, టిడిపిల మధ్య హోరాహోరీగా ఉండడం, ఈసారి గెలుపు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించడంతో విజయనగరం నియోజకవర్గంలోనూ ప్రచారానికి సిద్ధమయ్యారు. ఈ నాలుగు చోట్ల ప్రచారాలు చేపట్టడం ద్వారా మిగిలిన నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలను కూడా ఉత్తేజపర్చాలని బావిస్తున్నట్టు సమాచారం. అవకాశాన్నిబట్టి మరోదఫా జిల్లా పర్యటన చేపట్టి మిగిలిన నియోజకవర్గాల్లో సభలు నిర్వహించే యోచనలో బాబు ఉన్నట్టుగా తెలిసింది. అటు భోగాపురంలోనూ జనసేన - టిడిపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గెలుపు ద్వారా జనసేన ఉనికి చాటుకునేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే సీటు కేటాయింపు మొదులకుని, అనంతరం అసమ్మతి రాగాలను చల్లార్చడం, నేడు ప్రచార సభలు నిర్వహించడం వరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ నియోజకవర్గంలోని అసంతృప్తులు, సీటుకోసం ఆశపడిన కర్రోతు బంగార్రాజును నేరుగా పిలిపించుకుని చంద్రబాబు బుజ్జగించారు. అయినప్పటికీ అసంతృప్తి జ్వాలు అగడం లేదు. ఈ నేపథ్యంలోనే ఇరు పార్టీలకు చెందిన నేతలు నెల్లిమర్ల సభలో పాల్గొననున్నారు.

వైసిపితో ప్రజలకు మేలు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళలను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

వైసిపితోనే ప్రజలందరికీ మేలు జరుగుతోందని ఆ పార్టీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సోమవారం పట్టణ పరిధిలోని 22వ వార్డు, పొలవానివాలస, ఐటిఐ కాలనీ, జగనన్న కాలనీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదరికాన్నే కొలమానంగా తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని చెప్పారు. ఎవరి పాలన మేలు చేస్తుందో ప్రజలు గుర్తించాలని కోరారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే కడుబండి ప్రచారం

ప్రజాశక్తి-వేపాడ

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మండలంలోని కృష్ణ రాయుడుపేట, కుంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి మద్దతి వ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధిచేస్తా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కొప్పెర్లలో ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి మాధవి

ఆశీర్వదిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. సోమవారం మండలంలోని పూసపాటి పాలెం, కొప్పెర్ల, నడిపల్లి గ్రామాల్లో టిడిపి నేతలతో కలసి జన విజయ యాత్రలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. పూసపాటిపాలెం చెరువులో మహిళలతో మాట్లాడారు. ప్రచారంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, ఆకిరి ప్రసాదరావు, దంతులూరి సూర్యనారాయణరాజు, పిన్నింటి సన్యాసినాయుడు, ఐటివి శ్రీనువాసరావు, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షులు రౌతు స్వామినాయుడు, జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, పతివాడ శ్రీను, పాల్గొన్నారు.

శృంగవరపుకోటను విశాఖలో విలీనం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకారం చుట్టారన్నారు. రికార్డులను తీసేసి ఆన్‌లైన్‌లో వివరాలను పెట్టి వారికి నచ్చిన పేరున మార్చి కబ్జాచేసే కుట్ర చేస్తున్నారన్నారు. దుర్మార్గుల చేతుల్లో టెక్నాలజీ ఉంటే ప్రజలకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. మన తాత తండ్రుల నుంచి వచ్చిన భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలపై అతని బొమ్మ వేయించు కున్నాడని, ఆఖరికి పొలంలో హద్దులకు వినియోగించే రాళ్లపైన కూడా అతని బొమ్మ పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 200 ఉండే కరెంటు బిల్లును రూ. 1000 చేశాడని, రూ.60 ఉండే మద్యం సీసాను రూ. 200 చేశాడని, రూ. 5వేలు ఉండే ఇసుకను రూ. 50 వేలు చేశాడని చెప్పారు. పెట్రోలు అధిక రేట్లలో దేశంలో నెంబర్ వన్ స్థానంలో మన రాష్ట్రం ఉందన్నారు. ఇవన్నీ తగ్గాలంటే కూటమి విజయం సాధించాలన్నారు.

వైసిపి వ్యతిరేక ఓటు చీలరాదు

జగన్ అహంకారానికి చెక్‌పెట్టాలంటే వైసిపి వ్యతిరేక ఓటు చీలకూడదని, ఇదే విషయాన్ని నాలుగేళ్ల క్రితమే పవన్ కల్యాణ్ ప్రకటించారని అన్నారు. 2014లో కూడా రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ పనిచేశారని, ఇప్పుడు కూడా రాష్ట్ర భవిష్యత్తు కోసం పరిమితమైన సీట్లలో పోటీచేస్తున్నారని అన్నారు.

20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం

రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కృషిచేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో కష్టపడి పనిచేసే యువత, చదుకున్న నిరుద్యోగులు ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. దేశ ఆర్మీలో ఉత్తరాంధ్రకు చెందిన యువతే అత్యధికంగా ఉంటారని చెప్పారు. అటువంటి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించడం జగన్‌కు చేతకాలేదని విమర్శించారు. జగన్ గంజాయి, డ్రగ్స్ సరఫరా చేయించడం వల్ల పిల్లలు నాశనమై పోతున్నారన్నారు. తాను అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని, ఉద్యోగం రాని వారికి నిరుద్యోగ భృతి ఇస్తానని స్పష్టం చేశారు. యువతను దృష్టిలో పెట్టుకుని తాను ఈ ప్రాంతానికి ట్రైబుల్ యూనివర్శిటీ తీసుకొస్తే ఈ ఐదేళ్లలో జగన్ దాన్ని ముందుకు తీసుకెళ్లలేదన్నారు.

ఎస్‌కోటను ఎమ్మెల్యే అవినీతి కోటగా తయారు చేశాడు

ఇక్కడ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎస్‌కోట కొండను కొట్టి రూ.50కోట్లతో ఇళ్లుకట్టారని ఆరోపించారు. దొంగ పట్టాలు సృష్టించి భూములను లాక్కుంటున్నారని, ఇసుక అక్రమ రవాణాను బందువులకు అప్పగించారని, గంజాయిను ప్రోత్సహించి యువత జీవితాలను నాశనం చేస్తున్నాడని అన్నారు. ఈ సారి అతనికి బుద్ది చెప్పి ఎంతో చరిత్ర ఉన్న కోళ్ల కుటుంబాన్ని గెలిపించాలని కోరారు. ఆమె గెలుపునకు గొంప కృష్ణ, జనసేన, బిజెపి నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి టిడిపి అభ్యర్థి ఎం.భారత్, ఎస్.కోట అసెంబ్లీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, నాయకులు గొంప వెంకటరావు, వైస్ ఎంపిపి సుబ్బలక్ష్మి, పలువురు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతి చెందిన కాశీ విశ్వేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

ప్రజాశక్తి- గజపతినగరం

పట్టణంలోని ప్రముఖ వ్యాపారి ఆరిశెట్టి కాశీ విశ్వేశ్వరరావు (68) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని బైరిపురం జంక్షన్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది .ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కాశీ అదుపుతప్పి వెనుక నుంచి వస్తున్న లారీ వెనుక చక్రాల కింద పడిపోవడంతో తల నుజ్జునుజ్జయింది. దీంతో కాశీ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. గజపతినగరంలో వ్యాపారపరంగా పేరున్న కుటుంబానికి చెందిన కాశీ దుర్మరణం స్థానిక వ్యాపారులను తీవ్ర దిగ్భ్రాంతి గురిచేసింది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న ఎస్ఐ యు.మహేష్ ప్రమాద తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్‌తో పాటు క్లీనర్ కు గాయాలయ్యాయి. ఉప్పాడపేట జంక్షన్ వద్ద సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో అందులో ఉన్న డ్రైవర్ కు క్లీనర్ కు గాయాలయ్యాయి. వీరిని 108 ఆసుపత్రికి తరలించారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి వాములు దగ్ధం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగి సమీపాన సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఇదే గ్రామానికి ఎస్.ఆదినారాయణ, పాపినాయుడు, అల్లు వెంకు నాయుడుకు చెందిన మూడెకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు పాలకొండ అగ్ని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనడంతో మూడు స్తంభాలు విరిగిపోయాయి. ఒడిశాకు చెందిన లారీగా గుర్తించామని, ఫిర్యాదు చేశామని ఎఇ శివశంకర్ తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి వెంటనే విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

In the Honourable Court of the Junior Civil Judge Court at Cheepurupalli
OS 68/2023 IA 407/2023

Between:
Meesa Appala Naidu .....Plaintiff
And:
Damarasingi Appaji S/o Late Thavudu, age 40 years, R/o Konuru Village, Garividi Mandal, Vizianagaram Dist.

GENERAL NOTICE

Please take notice that the above named plaintiff filed a suit Against you for recovery of Promessory Note amount and also an Application Under xxxix (39) Rule (Rule) V3, Vide IA 407/2023 in OS 68/2023 to attach the Schedule Mention Property that the Honourable Court Several times Issue Summons to you. But you want only Escaped the Service of the Same.

That the above Suit and IA Posted for Heaving at **10-30 AM on 30-04-2024** Before the above Said (Said) Court and If you want to Contest the Matter you may do so either in person or by a duly Inst ructed pleader and if you fails to so Cause matter will be decided in you options and expertly

(By order of the Honourable Court)

Meesala Lakshmana Rao
Advocate,
Vangapallipeta Village,
Cheepurupalli,
Cell: 9490678935

'ప్రయివేటు'కు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. విజయనగరం జిల్లాలో మోడల్ స్కూళ్లకు చెందిన చెందిన నలుగురు విద్యార్దులు 590 మార్కులు దాటి సాధించడం గమనార్హం. జిల్లాలో 13 ఎపి మోడల్ స్కూల్స్ నుంచి 1185 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 1170 మంది ఉత్తీర్ణులై 98.73 శాతం ఫలితాలు సాధించారు. 3 ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి 194 మంది హాజరు కాగా 192 మంది ఉత్తీర్ణులై 98.97 శాతం నమోదు చేశారు. 8 సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాలు నుంచి692 మంది హాజరు కాగా వారిలో 565 మంది ఉత్తీర్ణులై 94.52 శాతం సాధించారు .6 బిసి గురుకులాల నుంచి 405 మంది హాజరు కాగా వారిలో 403 ఉత్తీర్ణులై 99.51 శాతం

గణనీయంగా మెరుగుపడిన టెన్త్ ఫలితాలు

ఫలితాలు సాధించారు. 26 కెజిబివి పాఠశాలల నుంచి 1024 మందికి 986 మంది ఉత్తీర్ణులై 96.29 శాతం ఫలితాలు సాధించారు. 214 జెడ్పి హైస్కూళ్ల నుంచి 12,444 మంది పరీక్షకు హాజరు కాగా 11,113 మంది ఉత్తీర్ణులై 89.30 శాతం ఫలితాలు సాధించారు. 5 మున్సిపల్ హైస్కూల్ నుంచి 773 మందికి 560మంది ఉత్తీర్ణులయ్యారు. 132 ప్రైవేటు పాఠశాలల నుంచి 5982 మందికి 5861మంది ఉత్తీర్ణులయ్యారు. ఒక ఎయిడెడ్ పాఠశాల నుంచి 120 మంది హాజరు కాగా 102మంది ఉత్తీర్ణులయ్యారు.

ఆరుగురు విద్యార్థులకు 590పైగా మార్కులు

ఆరుగురు మోడల్‌స్కూలు, ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు 590కుపైగా మార్కులు సాధించారు. సతివాడ మోడల్ స్కూల్ విద్యార్థి ఈశ్వర్ కార్తీక్ 594 మార్కులు సాధించాడు. కొత్తవలస మోడల్ స్కూల్ విద్యార్థి మారోతు హేమ వర్షిణి 592, ఎపి రెసిడెన్షియల్ బొబ్బిలి నుంచి కొట్టాపు వరుణ్ 592, మజ్జి హర్షవర్ధన్ 591, కర్రోతు .రాకేష్ 590, లగుడు జితిన్ సాయి 588, సతివాడ మోడల్ స్కూల్ విద్యార్థి కొంకి జాహ్నవి 592, మీసాల తేజేశ్వని 591, బొప్పడాం జెడ్పి హైస్కూల్ చెవూరు దుర్గా దిశిత 581, బిసి సంక్షేమ శాఖ నరవ హై స్కూల్ గోపిసెట్టి తరుణ్ 589, ఎపి మోడల్ స్కూల్ గర్భాం గుడివాడ సరస్వతి 589, జెడ్పి హై స్కూల్ బొండపల్లి పూడియామిని 589, కుమారాం జెడ్పి హైస్కూలు విజ్జపు యస్విత 589, ఎపి మోడల్ స్కూల్ భోగాపురం లెంక భావన 588, ఎపి మోడల్ స్కూల్ మరుపల్లి విద్యార్థి ఇమంది తపస్వినీ 588 మార్కులు సాధించింది.

జ్యోత్స్నను అభినందిస్తున్న అభ్యుదయ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు

'అభ్యుదయ' ప్రభంజనం

ప్రజాశక్తి-బొబ్బిలి

పదో తరగతి ఫలితాల్లో అభ్యుదయ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బొంతలకోటి జ్యోత్స్న 595 మార్కులు సాధించి, సత్తాచాటింది. బెవర జ్యోత్స్న 593, దాసరి దుర్గ, తీల రష్మిత 590 మార్కులు సాధించారు. ఐదుగురికి 589 మార్కులు పొందడం గమనార్హం. 103 మందికి 550 మార్కులకు పైగా రావడం విశేషం. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎం.కె.నాయుడు, ప్రిన్సిపల్ చింత శారద అభినందించారు.

శ్వేతచలపతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

కీర్తనను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఫ్రాన్సిస్ జార్జ్

పదో తరగతి ఫలితాల్లో శ్వేతచలపతి సంస్థానం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కాకి కీర్తన 589 మార్కులు సాధించింది. మొత్తం 45 మంది పరీక్ష రాయగా, అందులో 39 మంది 500 మార్కులకు పైగా సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ సుజయకృష్ణ రంగారావు, చైర్మన్ బేబినాయన, ప్రిన్సిపల్ ఫ్రాన్సిస్ జార్జ్ అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

శ్రీచైతన్య విద్యానికేతన్ విద్యార్థులు విజయకేతనం

ప్రజాశక్తి-బొబ్బిలి

టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సువ్వాడ చందన 585, రాజనాల షణ్ముఖ 572, ఎస్.లక్ష్మీప్రసన్న 570 మార్కులు సాధించారు. 35మంది విద్యార్థులు పరీక్ష రాయగా శత శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎస్.గౌరీశంకర్, సెక్రటరీ డి.పద్మ, యాజమాన్య ప్రతినిధి కొల్లి రామారావు, పాఠశాల వ్యవస్థాపకులు డి.నారాయణ అభినందించారు.

సత్తాచాటిన 'అభ్యాస్'

ప్రజాశక్తి-గరివిడి

గాయత్రి

పదో తరగతి ఫలితాల్లో అభ్యాస్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కె. గాయత్రి 591, జి.శృతి 590, జి. నిషిత 589, జి.దేవిశ్యా 589, జి. భాను ప్రసాద్ 589 మార్కులు సాధించారు. పరీక్షకు 97 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. స్కూల్ యావరేజ్‌ను 554గా నిలిపిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ ఎ.సుధీర్ అభినందించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ఎంఇఒ పి. రామారావు, డైరెక్టర్ జి. నర్సింగ్‌రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎ. సుధీర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కలలను సహకారం చేసే దిశగా అభ్యాష్ స్కూల్ కృషి చేస్తుందని అన్నారు.

'సెయింట్ ఆన్స్' విద్యార్థుల విజయపరంపర

ప్రజాశక్తి-కొత్తవలస

పి.శ్యామల

మంగళపాలెం వద్ద ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. 133 మంది పరీక్షలకు హాజరవగా వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. పి.శ్యామల 589 మార్కులు సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ సుధారాణి, కరస్పాండెంట్ కేథరిన్ అభినందించారు.

'శ్రీమైత్రి' జయకేతనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రమాదేవిని అభినందిస్తున్న డైరెక్టర్

పట్టణంలోని పోతనపల్లి జంక్షన్ వద్ద ఉన్న శ్రీమైత్రి విద్యానికేతన్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఎన్.రమాదేవి 560 మార్కులు సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ జి.ఎల్లయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వాణిసంతోష్ హైస్కూల్ ప్రభంజనం

ప్రజాశక్తి- డెంకాడ

కుప్పిలి నేహా

పదోతరగతి పరీక్షా ఫలితాల్లో చింతల వలస 5వ బెటాలియన్ ఎదురుగా సత్యనారాయణ పురం వాణి సంతోష్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 17మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 8మంది విద్యార్థులకు 500మార్కులకు పైగా వచ్చాయి. కుప్పిలి నేహా 570, జి.శిరీష 564, ఎన్. నందిని 560 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కె.రామకృష్ణ, ప్రిన్సిపాల్ కుప్పిలి సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఫోర్టుసిటీ స్కూల్ యాజమాన్యం

'ఫోర్టు సిటీ' విజయకేతనం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

టెన్త్ ఫలితాల్లో ఫోర్టసిటీ పాఠశాల విద్యార్థులు విజయపతాకాన్ని ఎగురవేసారు. పరీక్షకు హాజరైన 171 మంది విద్యార్థులు కూడా ప్రథమశ్రేణిలో ఉత్తర్ణత సాధించారు. చిలువూరి సిరివర్షిణి 592 మార్కులతో పాఠశాల ప్రథమస్థానాన్ని, కప్పల జాహ్నవి తిరుమలరాజు సాయి సహస్ర వర్మ 590 మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. 145 మంది విద్యార్థులు 500 మార్కులు పైగా సాధించారు. పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ) మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులతో శతశాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణంగా వుందన్నారు. విద్యార్థులను పాఠశాల వైస్ చైర్మన్ చంటి , ప్రిన్సిపల్ డాక్టర్ కోయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశీక్, నీతిమాగార అభినందించారు.

సత్తాచాటిన 'శ్రీచలపతి'

టెన్త్ ఫలితాల్లో శ్రీ చలిపతి స్కూలు విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారు. పరీక్షలకు హాజరైన 56 మంది విద్యార్థులు నూరు సాతం ఉతీర్వత సాధించారు. 56 మంది విద్యార్దులో 50 మంది ప్రథమ శ్రేణిలో, ఐదుగురు ద్వితీయ, ఒకరు తృతీయ స్థానంలో నిలిచారు. గరిష్టంగా రెల్లి మనీషా588, ఎన్.స్పందన 584, వై.సాత్విక్ 573 మార్కులు సాధించారు. 500 మార్కులు దాటిన విద్యార్థులు 23 ఉన్నారని డైరెక్టర్లు రాజేష్,. ఎల్.కృష్ణమూర్తి , మండల శ్రీనివాసరావు తెలిపారు. టెక్నో ప్రోగ్రాం, సూక్ష్మస్థాయి పర్యవేక్షణ, అధునాతన ఇంటిగ్రేటెడ్ త్రి బోర్డు పాఠ్యాంశాల పాఠ్యప్రణాళిక కారణంగా ఈ ఫలితాలు సాధ్యమైనట్లు తెలిపారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పల్లవి విద్యామందిర్ కరస్పాండెంట్ శేఖర్

'పల్లవి విద్యా మందిర్' భేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి ఫలితాల్లో పల్లవి విద్యామందిర్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లాలో అగ్ర స్థానంలో నిలిచారు. టివిఎస్ అపూర్వ 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించాడు. ఎం.ఓంకార్ 587, బి.సాయి సాత్విక్ 585, వి.మయాంక్ 583, కె.సాయి ప్రశాంత్ 574,పి.దినేష్ 574 మార్కులు సాధించి సత్తాచాటారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శేఖర్ అభినందించారు.

తోటపాలెం గాయత్రి స్కూల్ ప్రతిభ

తోటపాలెంలోని గాయత్రి హైస్కూలు విద్యార్థులు టెన్త్‌ఫలితాల్లో ప్రతిభ చూపారు. 20 మంది విద్యార్థులు వందశాతం ఫలితాలు నమోదు చేశారు. ఎం.సూర్య ప్రశాంతి571 మార్కులు సాధించింది. ఏడుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ అల్లు ఆదినారాయణ, వెంకట నరేంద్ర, సౌమ్యారావు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆనంద్‌కుమార్

ఎయిమ్ విద్యార్థుల హవా

తోటపాలెంలోని ఎయిమ్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు టెన్త్‌ఫలితాల్లో సత్తా చాటారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎల్.తేజస్విని, రూపశ్రీ 589, ఎం.త్రినయిని 585 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కడగల ఆనంద్‌కుమార్, ఎఒలు సిహెచ్ బాలాజీ, కె.సురేష్ అభినందించారు.

ఆదిత్య పాఠశాల నూరుశాతం

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించి విజయభేరి మోగించింది. 17 మంది విద్యార్థులు 500 మార్కులు దాటి సాధించారు. అత్యధికంగా 571 మార్కులు బి.రియా, ఎస్.డిల్లీశ్వర్ సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఉమా నాయుడు, ప్రిన్సిపల్ బి.కల్యాణి అభినందించారు.

'త్రినేత్ర' విజయదుందుభి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పదో తరగతి ఫలితాలలో త్రినేత్ర డిఫెన్స్ కాన్సెప్ట్ స్కూల్ విజయదుందుభి మోగించింది. హాజరైన ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
మంగళవారం
23 ఏప్రిల్ 2024

కురుపాంలో ఒక్కసారే టిడిపి గెలుపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గం 57 ఏళ్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్కసారి మాత్రమే ఇక్కడ టిడిపి విజయం సాధించింది. 1994లో టిడిపి అభ్యర్థి నిమ్మక జయరాజు కాంగ్రెస్ అభ్యర్థి శత్రుచర్ల చంద్రశేఖర్‌రాజుపై 32,271 ఓట్లతో విజయం సాధించారు. అప్పటినుంచి ఇప్పటి వరకు టిడిపి విజయం నమోదు కాలేదు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందించాలనే సంకల్పంతో నియోజకవర్గ కేంద్రమైన కురుపాం సమీపంలో గల టేకరికండిలో ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే నాలుగేళ్లయినా కళాశాల నిర్మాణం పూర్తికాలేదు. నేటికీ 50శాతం పనులు కూడా పూర్తి కాకపోవడంతో గిరిజనుల పట్ల వైసిపి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. సుమారు 105 ఎకరాల్లో రూ.153.858 కోట్ల రూపాయలతో కళాశాలను నిర్మించేందుకు 2020 అక్టోబర్ 2న పర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లవుతున్నా నిర్మాణ పనులు మందకొడిగా సాగుతుండడంతో గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందని ద్రాక్షగా మారుతోంది.

గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందేదెన్నడో?

- మందకొడిగా సాగుతున్న కళాశాల నిర్మాణ పనులు
- నేటికీ 50 శాతం పనులు మాత్రమే
- నిర్వాసితులకు అందని నష్టపరిహారం

ప్రజాశక్తి-కురుపాం

ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం 18నెలల్లో పూర్తిచేసి గిరిజన విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందిస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ నెరవేరలేదు. శంకుస్థాపన చేసిన ఐదు నెలల తర్వాత 2021 ఫిబ్రవరిలో పనులు ఎన్‌జెఆర్ కన్‌స్ట్రక్షన్ మొదలుపెట్టింది. మూడేళ్లయినా కళాశాల నిర్మాణ పనులు కేవలం 50శాతం మాత్రమే జరిగాయి. ఫేజ్ 1 కింద రూ.122.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు 45 కోట్లు వరకు పనులు చేయగా కేవలం రూ.27 కోట్లు మాత్రమే నిధులు విడుదలయ్యావని ఇంకాచేసిన పనులకు రూ.18కోట్లు మేరకు రావాల్సిన బకాయిలు ఉండడంతో పనులు నత్తనడకడగా జరుగుతున్నట్లు కాంట్రాక్టులు తెలిపారు.

జెఎన్‌టియు అధికారుల లెక్కల ప్రకారం

తొలుత ఈ కళాశాల నిర్మాణానికి జెఎన్‌టియు రూ.23 కోట్ల నిధులు ఇచ్చింది. 2022 జనవరిలో విజయనగరంలోని జెఎన్‌టియు గురజాడ యూనివర్సిటీ పరిధిలోకి ఇది వచ్చింది. అధికారుల లెక్కల ప్రకారం కళాశాల భవన నిర్మాణ పనులు ఇప్పటివరకు 50శాతం మాత్రమే పూర్తయ్యాయి. కళాశాల ప్రారంభానికి ఒక బ్లాక్ సిద్ధం చేయాలన్నా.. ఆరు నెలల పైనే సమయం పట్టే అవకాశం ఉంది. ఒక్కో బ్రాంచిలో 60 చొప్పున సివిల్, మెకానికల్, సిఎస్ఇ, ఇఇఇ, ఇసిఇ భాగాల్లో 300 సీట్లకు 2022లో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 80 బోధన, 6 బోధనేతర పోస్టుల మంజూరుతో పాటు 48 మంది పొరుగు సేవల సిబ్బంది నియామకానికి ఉత్తర్వులు ఇచ్చారు. 2020-21 విద్యా సంవత్సరంలో జెఎన్‌టియు విజయనగరం ప్రాంగణంలోనే తరగతులు నిర్వహించాలని, కళాశాల భవన నిర్మాణం పూర్తయ్యాక కురుపాం తరలించాలని అధికారులు ప్రతిపాదించినా ప్రభుత్వం అమోదం లభించలేదు. హేతుబద్ధీకరణ నేపథ్యంలో కళాశాలకు మంజూరైన బోధన పోస్టులను జెఎన్‌టియుకు మళ్లించారు. బోధన పోస్టులు మళ్లీ మంజూరవుతాయని, కళాశాల భవనాల పూర్తి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జెఎన్‌టియు అధికారులు పేర్కొంటున్నారు.

అందని నష్టపరిహారం

గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం చేపడుతున్న 105 ఎకరాల్లో కురుపాం మండలంలో గల టేఖరకండి గ్రామానికి చెందిన 16 మంది, జియ్యమవలస మండలం చంద్రశేఖరాజుపురం గ్రామానికి చెందిన 10 మంది గిరిజన రైతులకు సంబంధించిన 32 ఎకరాల 33 సెంట్లు భూమి ఉంది.వారికి ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా పనులు ప్రారంభించడంతో వారంతా సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన పెద్దఎత్తున పోరాడారు. పనులను అడ్డుకొని నష్టపరిహారం ఎకరాకు 30 లక్షలు చొప్పున ఇవ్వాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, గిరిజన సంఘం నాయకులు అరెస్టులయ్యారు. సబ్ కలెక్టర్ పనులు జరుగుతున్న స్థలం వద్దకు వచ్చి హామీ ఇచ్చి భూమికి భూమి ఇస్తామని చెప్పి సాగుకు పనికిరాని కొండ ప్రాంతంలో ఉన్న భూమిని చూపించారు. దీంతో గిరిజన రైతులు ఆ భూమి తమకు వద్దని, నష్టపరిహారం లేదా రెండు పంటలకు పనికొచ్చిన భూమికి చూపించాలని డిమాండ్ చేశారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం గానీ అధికారులు గానీ వారి సమస్యను పట్టించుకోలేదు. దీంతో గిరిజన నిర్వాసితుల పట్ల వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధి ఎంతో అర్థమవుతుంది.

నిధులు రాక నెమ్మదిగా పనులు

ఇప్పటివరకు రూ. 45 కోట్లతో పనులు పూర్తి చేయగా కేవలం 27 కోట్లు నిధులు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా చేసిన పనులకు రూ.18 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. నిధులు కొరత వలన పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. నిధులు సక్రమంగా సకాలంలో అందితే అనుకున్న సమయంలో కళాశాల నిర్మాణం పనులు చేపట్టి ప్రభుత్వానికి అప్పగిస్తాం.

- ఎన్‌జెఆర్ కనస్ట్రక్షన్ యాజమాన్యం

గిరిజనులు అంటే చులకన

గిరిజనులంటే ప్రభుత్వానికి, అధికారులకు చులకన. గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు అధికారులు ఏదో చేస్తామని గొప్పలు చెప్పడం తప్ప కింద గ్రామస్థాయికి వచ్చేసరికి వారి సమస్యలను పట్టించుకునే నాథుడే లేడు. ఎన్నోఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూమికి కనీసం నష్టపరిహారం ఇవ్వకుండా అక్రమంగా కళాశాల నిర్మాణం చేపట్టడం దుర్గార్గం.

- ఆరిక ధర్మారావు, గిరిజన రైతు టేఖరకండి గ్రామం

భూమికి భూమి ఇవ్వాలి

నాకున్నది కేవలం రెండు ఎకరాలు మాత్రమే. అది మా తాతలు ముత్తాతల నుండి సాగు చేస్తున్న భూమి . రెండు పంటలు సక్రమంగా పండి కుటుంబ పోషణ సాగుతుంది. కానీ ఆ భూమిని ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం తీసుకోవడంతో మేము వీధిన పడి కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి భూమికి భూమి ఇచ్చి ఆదుకోవాలి.

- మండంగి మురళి, గిరిజన రైతు, టేఖరకండి గ్రామం

2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి

2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమి నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు నష్టపరిహారం ఇవ్వాలి. గిరిజన రైతుల భూమి వద్ద ఎటువంటి పనులు చేయవద్దని హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ వారి ఆదేశాలను కూడా లెక్కచేయకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం కూడా హైకోర్టులో కేసు నడుస్తుంది. గిరిజన రైతులకు నష్టపరిహారం అందే వరకు కార్మిక సంఘం తరఫున న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తాం.

- కొల్లి గంగునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బేబినాయన నామినేషన్

పట్టణంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి బేబినాయన

టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన (ఆర్‌విఎస్‌కెకె రంగారావు) సోమవారం నిరాడంబరంగా నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలో వేణుగోపాల స్వామి ఆలయంలో మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, సోదరుడు రామ్‌నాయన, జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, బాబు పాలూరితో కలిసి పూజలు చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారి సాయిశ్రీకి నామినేషన్ అందజేశారు. అనంతరం బేబినాయన మాట్లాడుతూ తనపై అభిమానంతో నారసింహునిపేట గ్రామానికి చెందిన నిరుపేద తన రెండు వారాల ఉపాధి బిల్లు రూ.1300 ఇచ్చారని, ఆ డబ్బులను డిపాజిట్‌లో కలిపి ఇచ్చానని చెప్పారు. సుజయకృష్ణ మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి పాలన టిడిపి ద్వారానే సాధ్యమన్నారు. ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమన్నారు.

భారీ ర్యాలీ

బేబినాయన నామినేషన్ సందర్భంగా సోమవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. కోట వద్ద బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ర్యాలీని ప్రారంభించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి కూటమి కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బేబినాయన ఆస్తి రూ.21.13 కోట్లు

టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కుటుంబ ఆస్తి రూ.21,13,78,270 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బేబినాయన సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అందులో చరాస్తి బేబినాయన పేరు మీద రూ.3,19,53,154, ఆయన భార్య శిల్ప పేరిట రూ.71,99,116 ఉన్నట్లు చూపించారు. స్థిరాస్తి బేబినాయన పేరిట రూ.16.46 కోట్లు, ఆయన భార్య శిల్ప పేరిట రూ.76.26 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. బేబినాయన పేరిట రూ.5.70 కోట్లు రుణాలుండగా, ఆయన భార్య పేరిట రుణాలేవీ లేవు.

తండ్రి ప్రత్యక్ష పదవులు..తనయుడికి పరోక్ష పదవి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కీర్తిశేషులు మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు రాజకీయ చరిత్ర గజపతినగరం నియోజకవర్గంతో మొదలై సతివాడ నియోజక వర్గంలో ఎక్కువ కాలం సాగి, నెల్లిమర్ల నియోజకవర్గంతో ముగిసింది. మండలంలోని మొయిద విజయ రాంపురంలో జన్మించిన దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు గ్రామసర్పంచ్‌గా, కార్మిక నాయకుడిగా, అప్పట్లో సమితి ప్రెసిడెంటుగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అంచెలంచెలుగా ఎదిగిన సాంబ శివ రాజు1967లో తొలి సారిగా గజపతి నగరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. మళ్లీ 1972లో ఇదే నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తిరుగులేని నాయకుడుగా నిరూపించుకున్నారు. అదే విజయ పరంపర కొనసాగిస్తూ పెనుమత్స 1978లో ఏర్పడిన సతివాడ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటి చేసి గెలుపొందారు. 1983, 1985లో ఎన్నికల్లో టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్‌టిఆర్ హవాలో ఆంధ్రప్రదేశ్ మొత్తం కాంగ్రెస్ పార్టీ తుడుచుకుపోయినా సాంబశివరాజు మాత్రం గెలిచి సత్తా చాటుకున్నారు. 1989 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా విజయ పరంపర కొనసాగించారు. 1994లో జ్యూట్ మిల్ కాల్పుల సంఘటనలో అప్పటి ఎన్నికల్లో ఓటమి చవి చూడాల్సి వచ్చింది. కాగా 1999, 2004లో తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో గెలిచి సాంబ శివ రాజు తిరిగి పూర్వ వైభవాన్ని సొంతం చేసుకొని అప్పటి ముఖ్య మంత్రులు నేదురు మల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రి వర్గంలో మంత్రి పదవిని పొందారు. 2009లో సతివాడ నియోజకవర్గం పోయి పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలతో నెల్లిమర్లను కలిపి నెల్లిమర్ల నియోజక వర్గంగా మార్పు చెందడంతో సాంబశివరాజు పోటీకి దూరమయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ భవిష్యత్తు అందకారంలోకి వెళ్లింది. నియోజకవర్గం పునర్విభజన తరువాత ఆయనకు ఎమ్మెల్యే సీటు రాదని భావించి అవమానానికి గురువుతున్న నేపథ్యంలో ఆయన శిష్యుడుగా ఉన్న బొత్స సత్యనారాయణ 2008 ఆగస్టులో సాంబశివరాజు పుట్టిన రోజు వేడుకలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని రప్పించి అతనితో శుభాకాంక్షలు చెప్పించి సాంబశివరాజును ఖుషీ చేశారు. ఆ తరువాత వచ్చిన 2009 ఎన్నికల్లో సాంబశివరాజుకు నెల్లిమర్ల నుంచి సీటు దక్కలేదు. ఆయన స్థానంలో అప్పటికే జెడ్పి చైర్మన్‌గా పనిచేసిన బడ్డుకొండ అప్పలనాయుడుకు నెల్లిమర్ల ఎమ్మెల్యే సీటును మంత్రి బొత్స ఇప్పించారు. దీంతో తన శిష్యుడే తనకు సీటు రాకుండా చేశారని సాంబశివరాజు మదన పడ్డారు. తరువాత రాజశేఖర్ రెడ్డి మరణించడం జగన్మోహన్‌రెడ్డి వైసిపి పార్టీని స్థాపించడంతో సాంబశివరాజు వైసిపిలోకి వెళ్లిపోయారు. తరువాత వచ్చిన 2014 ఎన్నికల్లో సాంబశివరాజు కుమారుడు సురేష్‌బాబు వైసిపి తరుపున నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఫలితాలు భేష్

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వరుసగా రెండో ఏడాది వచ్చాయి. గత ఏడాది రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలవగా ఈ ఏడాది 97 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలోనే నిలిచింది. ప్రధానంగా సాలూరు గిరిజన సంక్షేమ సహాయ అధికారి పరిధిలో ఉన్న పాఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు వచ్చాయి. సాలూరు, పాచిపెంట, మక్కువ, పార్వతీపురం మండలాల్లోని పాఠశాలల్లో 617 మంది పదోతరగతి విద్యార్థులు 614 మంది హాజరయ్యారు. మండలంలోని మావుడి, మామిడిపల్లి, కురుకుట్టి, రావికోన, పాచిపెంట, బడ్నాయికవలస, సరాయివలస, వేటగానివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గిరిజన సంక్షేమ సహాయ అధికారి పరిధిలో ఉన్న పాఠశాలల్లో 97.41శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే పట్టణంలోని జ్యోతిబా పూలే బిసి గురుకుల బాలికల పాఠశాల లో 79 మంది పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. నీలబోను లిఖిత 556 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ మూకల పెంటయ్య చెప్పారు. 500 మార్కులు పైగా సాధించిన 45 మంది వున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సాలూరురూరల్ : మండలం టెన్త్ ఫలితాల్లో 94శాతం ఉత్తీర్ణత సాధించిందని ఎంఇఒ ఎం.రాజ్ కుమార్ తెలిపారు. మండలంలోని 854 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 827 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు, ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన కె.మౌనిక 583 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. మండలంలోని మామిడి పల్లి, కురుకుట్టి, మవుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. అంటివలస, కొత్తవలస ఆశ్రమ పాఠశాలలో 98శాతం ఉత్తీర్ణులైనట్టు ఎంఇఒ తెలిపారు.

కొమరాడ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు మరోసారి ప్రతిభ కనబరిచారు. కొమరాడ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పదవ తరగతి 71 మంది పరీక్ష రాయగా70 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపల్ లక్ష్మణరావు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న ముద్దువలవినీత్ 552, పువ్వల బన్నీ 525, దుమ్ముడి దుర్గాప్రసాద్ 520 మార్కులతో టాపర్లుగా నిలిచారు.

భామిని : మండలంలోని 7 ప్రభుత్వ, 2 ప్రవేట్ పాఠశాలల నుంచి 473 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 444 మంది ఉత్తీర్ణులైనట్టు ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో ఎంపి మోడల్ స్కూల్‌కు చెందిన జి.లావణ్య 573, స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన బి.నాయుడు 553, బత్తిలి జిల్లా పరిషత్ హై స్కూల్ లో బి. సింధు 570, బాలేరు జిల్లా పరిషత్ హై స్కూల్ ఎల్.పవన్ 551, పెద్దదిమిలి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు ఎం.తనూజా 518, భామిని కెజిబివి పాఠశాలకు చెందిన ఎం.గీతాలక్ష్మి 541 మార్కులు, అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన జి.భాగ్య 544 మార్కులు, బత్తిలి కానోసా ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని అల్లాడ సోనియా 580 మార్కులు సాధించి మండలం టాపర్‌గా నిలిచిందని ఎంఇఒ తెలిపారు.

మక్కువ : టెన్త్ ఫలితాల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.పూజిత 579 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎపి మోడల్ పాఠశాల 100శాతం ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాల, అనసభద్ర ఏకలవ్య పాఠశాల, వెంకట బైరిపురం, ఎ.వెంకంపేట, శంబర ఉన్నత పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

సీతంపేట ఐటిడిఎ 98 శాతం

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల 44 ఆశ్రమ, గురుకుల విద్యాలయాల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన 1708 మందికి గానూ 1675 (98.07శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. శత శాతం సాధించిన పాఠశాలలు 28 ఉన్నాయి. వీటిలో మన్యం జిల్లాలో 16, శ్రీకాకుళంలో 12 పాఠశాలలు ఉన్నాయి. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పిఒ కల్పనాకుమారి, డిడి అన్నదొర, పిఎంఆర్‌సి ఎటిడబ్ల్యుఒలు అభినందించారు. అదేవిధంగా పులిపుట్టి సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ పాఠశాలలో 36 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 36 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలకు చెందిన మోక్షజ్ఞ విద్యార్థి 575 మార్కులు సాధించాడు. వీరిని ప్రిన్సిపల్ నవీన్, కరస్పాండెంట్ పెంటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్కారు బడిలోనే జిల్లా ఫస్ట్

పార్వతీపురం టౌన్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని సర్కారు బడులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు సర్కారు బడుల పైనే మక్కువ చూపిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో వేలాది రూపాయల ఖర్చుపెట్టినా రాని ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్నాయి. దీనికి నిదర్శనం పార్వతీపురం పట్టణంలోని పి ఆర్ఎంఎం, కెపిఎం, డివిఎంఎం ఉన్నత విద్యార్థులే. పట్టణంలోని టిఆర్ఎంఎం బాలికల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థిని కంచరి గౌతమి 591 మార్కులు సాధించి జిల్లాలోని ప్రథమంగా నిలవడంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆ విద్యార్థిని అభినందించారు. ఈపాఠశాల నుంచి 86 మంది విద్యార్థినిలకు గానూ 70 మంది ఫస్ట్ డివిజన్లోనూ ఉత్తీర్ణులయ్యారు. అలాగే కెపిఎం ఉన్నత పాఠశాల నుండి 172 మంది విద్యార్థులకు 166 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలకు చెందిన వి.కుసుమలత అత్యధికంగా 586 మార్కులు సాధించింది. డివిఎంఎం ఉన్నత పాఠశాల నుండి 85 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 82మంది ఉత్తీర్ణులయ్యారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా జగదీశ్వరి నామినేషన్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తోయిక జగదీశ్వరి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కోట దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్, టిడిపి, జనసేన, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి వివి రమణకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన బాబు షురిటీ భవిష్యత్తు గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాలే టిడిపి గెలుపునకు నాందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె. మల్లేశ్వరరావు , టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా హిజ్రా నామినేషన్

కురుపాం నియోజకవర్గ అసెంబ్లీ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా హిజ్రా అడ్డాకుల గీతారాణి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కురుపాంలో తను నివాసం ఉంటున్న గాంధీనగర్ వీధి నుండి నియోజకవర్గంలో గల ఐదు మండలాల హిజ్రాలతో కలిసి తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము కూడా అన్ని రంగాల్లో సమానమైమని, అటువంటిది రాజకీయాల్లో కూడా హిజ్రాలుండాలని అటువంటప్పుడే సమాజంలో తమకు కూడా గుర్తింపు ఉంటుందని అందుకే రాజకీయాల్లోకి రావడం జరిగిందని అన్నారు.

కూలిపోయిన చెట్టు

కూలిన భారీ వృక్షం .. తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఎన్నో ఏళ్లనాటి వృక్షాలకు కాలం చెల్లడంతో కూలుతున్నాయి. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం తపాల శాఖ కార్యాలయం వీధిలో ఉన్న భారీ వక్షం సోమవారం ఉదయం కూలింది. ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం చెప్పింది. అయితే రేకుల్లపై చెట్టు కూలడంతో ధ్వంసమయ్యాయి. పార్కు చేసిన స్కూటీపై చెట్టు పడడంతో పాడైందని వాహనదారుడు దిబోమంటున్నాడు. ఏళ్ల నాటి వృక్షలపై అధికారులు దృష్టి సారించి తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మస్తర్లు తనిఖీ చేసిన ఎపిఒ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర, ఎస్ పెద్దవలస పంచాయతీ పరిధిలోని అన్ని చెరువు పనుల వద్ద సోమవారం మస్తర్లను ఎపిఒ ఈశ్వరమ్మ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో పనిచేసే విధానంపై ఆమె ముచ్చటించారు. సక్రమంగా పనిచేస్తే ప్రభుత్వ విధానం ప్రకారం వేతనం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - వీరఘట్టం

జనసేన పార్టీలోకి వైసిపి నాయకుల చేరికల పర్వం కొనసాగుతుంది. మండలంలోని సంత నర్సిపురానికి చెందిన పలువురు జనసేనలో సోమవారం చేరారు. వీరికి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మహదేవివలస, దశమంతపురం, చలివేంద్రి, బూరుగ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ బిసి సెల్ కన్వీనర్ పి.కృష్ణమూర్తి నాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, మండల కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి బీవీ నాయుడు, సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవికుమార్, బి నీలకంఠనాయుడు, టిఎన్టియుసి అధ్యక్షులు ఎన్.శశికుమార్, కె.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన సురేష్ స్కూల్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం విద్యానగర్‌లో గల సురేష్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో తన సత్తాను చాటారు. ఈ ఏడాది పరీక్షకు హాజరైన 210 విద్యార్థులకు గానూ 207 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 98.57 శాతం విజయాన్ని నమోదు చేశారు. వీరిలో వీరిలో సిహెచ్ వసంతకుమారి 582, జి.శరణ్య 579, వి.ప్రదీప్ 552 మార్కులు సాధించి స్కూల్లో టాపర్లుగా నిలిచారు. వీరిని కరస్పాండెంట్ గుడ్ల ప్రసాదరావు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

తమ్మినాయుడు పాఠశాల విద్యార్థులు విజయదుంధుభి

పాలకొండ : పదో తరగతి ఫలితాల్లో పాలకొండ తమ్మినాయుడు పాఠశాల విద్యార్థులు విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఎస్.నమిత 584 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే గురుబిల్లి శ్రీవల్లి 583, ఇసుకపట్ల విశాల్ 580, రౌతు సంతోష్ కుమార్ 580, మహేశ్వరి 576 మార్కులు సాధించారు. 84 మందిలో 550 మార్కులు పైబడి 20 మంది, 500 మార్కులు పై బడి 51 మంది సాధించారు. వీరిని తమ్మినాయుడు విద్యాసంస్థల అధ్యక్షులు శెట్టి నారాయణమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి రావు, పాఠశాల ఏఓ జి. తిరుపతి రావు అభినందనలు తెలియజేశారు. అలాగే పాలకొండ పట్టంలోని బోణంవీధికి చెందిన మండల కీర్తన 591 మార్కులు సాధించింది. ఈమె స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో చదువుతోంది.

శత శాతం ఫలితాలు సాధించిన శ్రీజన్

పార్వతీపురం : టెన్త్ ఫలితాల్లో స్థానిక శ్రీజన్ హై స్కూల్ శత శాతం సాధించింది. ఈ పాఠశాలకు చెందిన ఎస్ .భాను సుజనా 583 మార్కులు సాధించగా, కె.పార్వతీశం 563, బి.హాసిని 549 మార్కులు సాధించారు. 13 మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించారు. శ్రీజన్ స్కూలు ప్రారంభించి రెండో బ్యాచ్‌కె అత్యంత ఉత్తమ ఫలితాలు సాధించడం పట్టణ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ య.శ్రీను అభినందనలు తెలిపారు.

సంధ్యారాణి ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు రూరల్

పట్టణంలోని 12, 13, 14, 16, 17 వార్డుల్లో టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ సూపర్‌సిక్స్ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పి భంజదేవ్, పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, నాయకులు కూనిశెట్టి భీమారావు, బోని గంగరాజు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం, కరకవలస ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. విద్యార్థులు వర్క్ బుక్స్, ఉపాధ్యాయులు డైరీ, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థుల మెనూ పరిశీలించారు. కార్యక్రమంలో సిఆర్‌పి రాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజన్నదొర ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని రామా కాలనీలో డిప్యూటీ సిఎం రాజన్నదొర సోమవారం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరిచిపోతే ప్రజలు తమని తాము వంచన చేసుకున్నట్లే అవుతుందని చెప్పారు. ఎన్ని పార్టీ లు కలిసి పోటీ చేసినా వైసిపిదే గెలుపు అన్నారు.మరోసారి ఎమ్మెల్యే గా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, పట్టణ వైసిపి అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ వైసిపి ఉపాధ్యక్షుడు రౌతు సురేష్, కౌన్సిలర్ లు రాపాక మాధవరావు గొర్లి వెంకటరమణ డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ,23 వార్డు నాయకులు ఎం.శంకరరావు,తాడ్డి రమణ,వార్డు ఇంఛార్జి పున్నాన మోహన్ రావు పాల్గొన్నారు.

కొత్తవలసలో ప్రచారం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి అన్నారు. సోమవారం ఆమె స్థానిక నాయకులు ఎస్.జయసింహ, బొన్నాడ సీతారాంతో కలిసి కొత్తవలసలో ఇంటింటికీ తిరిగి జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యేగా రాజన్నదొరకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయాలని కోరారు.

రామా కాలనీలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

కురుపాంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు

ఏజెన్సీలో సిపిఎం విస్తృత ప్రచారం

నేడు సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలో సిపిఎం అభ్యర్థి మండంగి రమణ విస్తృతంగా ప్రచారం చేశారు. మండలంలోని పాలెం పంచాయతీ రావికోనలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బిన్నిడి, తీలేసు, నయా పంచాయతీకి సంబంధించిన దేరుపాడు, సంకేసు, గుడ్డం, నయా, పూడేసు, పెద్దశాఖ తదితర గ్రామాలకు నేటికీ రోడ్డులేని పరిస్థితి ఉందని అన్నారు. అలాగే అనేక గిరిజన గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గిరిజన, దళిత, మైనార్టీ, మహిళా, కార్మిక రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. కావున ఈ సమస్యలపై పోరాడుతున్న సిపిఎం అరుకు పార్లమెంటు ఎంపిగా పాచిపెంట అప్పలనరస, కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మండంగి రమణ పోటీ చేస్తున్నారు. వీరికి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే మంగళవారం కురుపాంలో ఎమ్మెల్యేగా నామినేషన్ వేస్తున్న మండంగి రమణకు మద్దతుగా మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రచారంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడ ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు ఉపేంద్ర, వెంకటేష్, నాగభూషణ్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఇండియా బ్లాక్ మద్దతుతో కురుపాం నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండంగి రమణ నామినేషన్ కార్యక్రమంలో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ కోరారు. మండలంలోని బాసంగి, సంధిగూడ, కె.శివడ, ఎస్‌కె పాడు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గిరిజనుల పక్షాన ఉండి పోరాడుతున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి రమణకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పువ్వల మోహన్‌రావు, రామస్వామి, సన్యాసిరావు ఉన్నారు.

కురుపాం : మండలంలోని భారామణి, గొత్తిలి, కైరాడ గిరిజన గ్రామాల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.ఈశ్వరరావు సిపిఎం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు వద్దకు వెళ్లి సిపిఎం కురుపాం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణకు, అరుకు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు వి.వాసుదేవరావు, అంగధ, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవాలు లక్ష్యంగా చర్యలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సురక్షిత ప్రసవాలే ధ్యేయంగా గర్భిణీల ఆరోగ్యానికై కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. కొమరాడ, జియ్యమ్మవలస మండలాలకు చెందిన పిహెచ్‌సిల వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం గిరిమిత్ర సమావేశ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణీ నమోదైనప్పటి నుంచి ప్రసవం జరిగే వరకూ పూర్తిస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని, మొదటి త్రైమాసికంలోనే గర్భిణులు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తద్వారా త్వరగా వైద్య పరీక్షలు జరిపి హైరిస్క్ గర్భిణీలకు గుర్తించవచ్చని తెలిపారు. పిహెచ్‌సిల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. కాన్పు తర్వాత శిశు ఆరోగ్య పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. దీర్ఘకాలిక రోగులు, టిబి వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలన్నారు. ఎఫ్‌డిపి, ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎఫ్‌డిపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, డిపిహెచ్‌ఎన్‌ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదు

గరుగుబిల్లి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై మండల పరిధిలోని రావుపల్లిలో సోమవారం ఎస్‌ఐ వై.అమ్మన రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎటువంటి తగాదాలు, చట్టం వ్యతిరేక విధానాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ప్రశాంత వాతా వరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. సమా వేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. బాలగుడబ గ్రామాన్ని సోమవారం ఆయన పర్యటించారు. జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో వైద్య సిబ్బంది చేపట్టిన నివారణ కార్యక్రమాలను పర్యవేక్షణ చేశారు. ఫీవర్ సర్వలెన్స్ ద్వారా జరిపిన నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. దీర్ఘకాలిక రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను పరిశీలించి, అవసరమైన ప్రదేశాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ తదితర జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, డ్రైడే అంతా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ధనుంజయరావు, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది శ్రీధర్, జగదీష్, రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా లెనిన్ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక సుందరయ్య భవనంలో రష్యన్ విప్లవ సారథి లెనిన్ 154వ జయంతి వేడుకలు సోమవారం సిపిఎం ఆధ్వర్యాన జరిగాయి. ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ మార్క్సిజం ప్రపంచంలో విస్తరించడానికి, దాన్ని కొత్త పుంతలు తొక్కించడానికి లెనిన్ అనుసరించిన మార్గం సాధించిన విజయాలు ప్రతి ఒక్కరూ అధ్యయనం చేసి తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.ఇందిర, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిపిఎం నాయకులు బి.సూరిబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

25న సంధ్యారాణి నామినేషన్

సాలూరు రూరల్ : ఈనెల 25న టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ వేస్తున్నానని ఈ కార్యక్రమానికి తరలి రావాలని గుమ్మిడి సంధ్యారాణి అభ్యర్థించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రావడం ఎంతో ఆవశ్యకత ఉందన్నారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతి, సాలూరు, మక్కువ, పాచిపెంట పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణు, పిన్నింటి ప్రసాద్ బాబు, బూస తవుడు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు పాల్గొన్నారు.

8 మంది వాలంటీర్ల రాజీనామా

భామిని : మండలంలోని నేరడి సచివాలయం పరిధిలోని 8 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సచివాలయం సెక్రటరీ లోవ అనసూయకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సరిసభద్ర బాలకృష్ణ, వైసిపి నాయకులు అర్లి రాజశేఖర్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన సర్కారు బడులు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాలు ఘనంగా వచ్చాయి. ఎం సింగపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 48 విద్యార్థులకు గానూ 48మంది వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాలకొండ ప్రభుత్వ బాలికల పాఠశాలలో 98మంది విద్యార్థులు గానూ 84మంది, జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో 103మందికి గానూ 75మంది, బాలురు పాఠశాలలో 47మంది గానూ 38మంది ఉత్తీర్ణత సాధించారు. చిన్న మంగలాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 40 మందికి విద్యార్థులకు గానూ 35మంది, తంపటాపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 46మందికి 41మంది బాసూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 42మందికి 40మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే పాలకొండలోని గిరిజన ఆర్‌సిఎం పాఠశాలలో 40మంది విద్యార్థులకు గానూ 40మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చిన్న మంగలాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుచున్న రాగోలు షర్మిల 548 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానం పొందడంతో ఉపాధ్యాయులు గర్వపడుతున్నారు.

మండల టాపర్‌గా సంజన

వీరఘట్టం : మండలంలోని నీలా నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.సంజన సోమవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 587 మార్కులు సాధించి మండలానికి టాపర్‌గా నిలిచింది. అలాగే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు జి.రవి ప్రసాద్ తెలిపారు. అలాగే తలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎం.రాకేష్, టి.సాయి చరణ్య 585 మార్కులు సాధించారు. తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.నీరజ 577, వీరఘట్టం మహర్షి హై స్కూల్‌కు చెందిన ఎస్.అక్షయ 574, రేగులపాడు కెజిబివి విద్యార్థిని వై.మాధురి 569, గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల చెందిన కె.రోహిత్ కుమార్ 561 మార్కులు సాధించారు. మండలం 96.71 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఎంఇఒ డి.సూర్యదేవుడు తెలిపారు. నిడగల్లు జిల్లా హైస్కూల్‌లో 60 మంది విద్యార్థులకు 60 మంది ఉత్తీర్ణత శాతం సాధించారు. జి.రోహిత్‌కు 562 మార్కులు సాధించాడు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 73 మంది విద్యార్థులకు గానూ 70 మంది, ఆర్ వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16 మందికి గాను 16 మంది, మరిపువలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులు 17 మంది ఉత్తీర్ణత శాతం సాధించారు. అలాగే సీతానగరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 76 మందికి 75 మంది, జోగింపేట కెజిబివిలో 40 మందికి గాను 40 మంది, జోగింపేట గురుకుల పాఠశాలకు చెందిన 66 మంది విద్యార్థులకు 66 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ పాఠశాలకు 42 మంది విద్యార్థులకు 42 మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలికలదే పైచేయి

గుమ్మలక్ష్మీపురం : ఈ ఏడాది నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 71మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత పొందారు. ఈ పాఠశాలలో ఎస్.ప్రణీత్ 536 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే భద్రగిరి పిటిజి పాఠశాలలో 75మంది విద్యార్థులు పరీక్షలు రాయగా శాతం ఉత్తీర్ణత సాధించారు. 557 మార్కులతో లావణ్య పాఠశాలకు ప్రథమ స్థానంలో నిలిచింది. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 54 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా, 49 మంది ఉత్తీర్ణత పొందారు. ఈ పాఠశాలలో 557 మార్కులతో విద్యార్థిని వై.తేజసింహ మండలానికే ప్రథమ స్థానంలో నిలిచింది.

కొమరాడ : టెన్త్ ఫలితాల్లో మండలం నుంచి మంచి ఉత్తీర్ణతతో విద్యార్థులు పాస్ అయ్యారని ఎంఇఒ జామి నారాయణ స్వామి తెలిపారు. మండలంలో 508 మంది విద్యార్థులకు 489 మంది విద్యార్థులు పాసైనట్లు వెల్లడించారు. మండలంలో అత్యధికంగా మదలింగి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన తెర్లి సాహితి, హేమంత్ కుమార్ పండా 586మార్కులు సాధించినట్టు తెలిపారు.

అన్ని పాఠశాలలూ శతశాతమే..

జియ్యమ్మవలస: మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబా పాఠశాల, 4 గిరిజన సంక్షేమం ఆశ్రమ పాఠశాలలో చదివిన 477 మంది పరీక్షలు రాయగా 477 మంది ఉత్తీర్ణత సాదించినట్లు ఎంఇఒ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. బిజేపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.నిషిత 578 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. పెదమేరంగి తిరుమల సాయి ఉన్నత పాఠశాల శతశాతం సాధించింది. ఈ పాఠశాలకు చెందిన ఎం.పూజిత 567 మార్కులు సాధించింది. సత్య కైలాస్ పాఠశాల శతశాత సాధించారు. పదోతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనా సిబ్బంది అభినందనలు తెలిపారు.

గరుగుబిల్లి: టెన్త్ ఫలితాల్లో మండలంలో కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొట్టాపు విశాలాక్షి 568 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అలాగే బొబ్బిలి జ్ఞానేశ్వరి 541 మార్కులు, దాకేటి పార్వతి 536 మార్కులు సాధించినట్టు ఎంఇఒ నాగిరెడ్డి నాగభూషణరావు తెలిపారు. ప్రభుత్వ బడులు ప్రైవేటు బడులకన్నా ధీటుగా విద్యను అందించడంలో ముందంజలో ఉన్నాయని తెలిపారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల ఖ్యాతిని చాటారు. బందులుప్పి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ శివ 572, బి అశ్విత 561, జాగాన కవిత 558 మార్కులు సాధించగా, తాళ్లపూడి జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు శతశాతం సాధించి ఎల్ భావన 574, వై.శివప్రసాద్ 563, పి హరీష్ 560 మార్కులు సాధించారు. పెద్ద బొండపల్లి స్కూలుకు చెందిన వై శోభారాణి 583, వి.ప్రసన్న 577, వి. విజయలక్ష్మి 570 మార్కులు సాధించారు. ఎన్ ములగ జెడ్‌పి పాఠశాల శతశాతం ఉత్తీర్ణ సాధించింది. 583 మార్కులు సాధించిన శోభారాణి మండలంలో టాపర్‌గా నిలిచింది. ఈమెను సోమవారం ఎంఇఒ ఎస్ సింహాచలం, ప్రధానోపాధ్యాయులు వి. గౌరీ ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి - పాచిపెంట

పదో తరగతి ఫలితాల్లో స్తానిక కెజిబివి బాలికలు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యాలయంగా గుర్తింపు పొందింది. ఈ విద్యాలయం నుంచి 38మంది బాలికలు పరీక్షలు అందరూ ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఎం.షనీ 529, పి.కీర్తన 508, బి.శ్రావణి 506 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రత్యేక అధికారి షేక్ నజీయాకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నమూనా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

మోడల్ పోలింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలింగ్ ప్రక్రియపై వివిధ వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి సోమవారం ప్రారంభించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రంలో, పోలింగ్ అధికారుల స్థానాలు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, ఏజెంట్ల స్థానాలు, నమూనా ఇవిఎంలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, ఎన్నికల సూపర్నెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

పూల్‌బాగ్‌లోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో 2024-25లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.మహేశ్వరరెడ్డి తెలిపారు. 1 వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 38 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 6ఏళ్ల నుంచి 14ఏళ్లలోపు వయసుఉండాలని, కనీసం 40శాతం అంధత్వం ఉండాలని తెలిపారు. ఉచితవసతి సౌకర్యం, ఆధునిక బ్రెయిలీ సామాగ్రితో విద్య, స్మార్టు క్లాసులు, కంప్యూటర్ పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ ఉంటాయని తెలిపారు. వివరాలకు 8317548039, 7989592141, 9676702530 ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సాయి ఆస్పత్రిలో సైక్రియాట్రిస్ట్ సేవలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

నగరంలోని సాయి ఆసుపత్రిలో ఉచిత సైక్రియాట్రిస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ అక్కేన శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయి ఆసుపత్రిలో న్యూరో సైక్రియాటిస్ట్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ విశాఖ కు చెందిన ప్రత్యేక సైక్రియాటిస్ట్ వైద్యులు డాక్టర్ నిహాల్ తమ ఆసుపత్రిలో రోగులకు ప్రతి సోమవారం సేవలు అందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వివిధ రకాల శస్త్ర చికిత్సలను సైతం తమ ఆసుపత్రిలో సాయి ట్రస్ట్ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నామని, ఈ వైద్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ వివిధ రకాల మానసిక సమస్యలతో ఆందోళన, ఒత్తిడికి కు గురవుతున్నవారు, మాదక ద్రవ్యాలు, మద్యానికి బానిసైన వారు సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహాల్‌ను సత్కరించారు.

టెన్త్‌లో గజపతినగరం మండలం మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి-గజపతినగరం

టెన్త్‌ఫలితాల్లో గజపతినగరం మండలం 90 శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రభుత్వ, జెడ్‌పి, ప్రైవేటు పాఠశాలలు సైతం ఉత్తమ ఫలితాలు సాధించి మండలాన్ని ముందంజలో నిలిపాయి. మరుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిమిమంది తపస్విని 588 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచాడు. అలాగే స్థానిక బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థిని కడగల మల్లేశ్వరి 570 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా, 572 మార్కులు సాధించి బాలురు ఉన్నత పాఠశాల విద్యార్థి పి.సందీప్ టాపర్‌గా నిలిచారు. మోడల్‌స్కూల్ 98.77, గర్ల్స్ హైస్కూల్ 93శాతం, బాలుర హై స్కూల్ 82శాతం, గంగచోళ్లపెంట హైస్కూలు 72.13శాతం, లోగిశ 92.3, మరుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 83.69, జిన్నాం, హైస్కూల్ 96.97, మరుపల్లి కెజిబివి 98.77 శాతం ఫలితాలు సాధించాయి. మండలంలోని ప్రయివేటు పాఠశాలలు కృష్ణావిద్యాపీఠ్, ఆర్‌సి ఎం, సాయి గౌతమి హైస్కూల్ 100శాతం ఫలితాలు సాధించాయి

ఉమ్మడి జిల్లాలో నాలుగోరోజు సోమవారం 30 నామినేషన్లు దాఖలయ్యాయి.వాటిలో విజయనగరం జిల్లాలో ఎంపి స్థానానికి ముగ్గురు , అసెంబ్లీ స్థానాలకు 18 మన్యం జిల్లాలో అరకు స్థానానికి ఐదుగురు, అసెంబ్లీ స్థానాలకు నలుగురు నామినేషన్లు వేశారు. బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా వికెఎస్ కష్ణ రంగారావు(బేబినాయన), కురుపాంలో టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి, అరకు పార్లమెంట్‌స్థానానికి బిజెపి అభ్యర్థిగా కొత్తపల్లి గీత నామినేషన్ వేశారు.

ఎమ్‌పి అభ్యర్థిగా బెల్లాన నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పార్లమెంట్ స్థానానికి వైసిపి అభ్యర్థిగా ఎంపి బెల్లానచంద్రశేఖర్ సోమవారం నామినేషన్ వేశారు. తన నామినేషన్‌పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మికి ఒదజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మద్ది శ్రీనివాసరావు సహాయ సహకారాలతో మరోసారి ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించారని తెలిపారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. తన హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చామని, అనేక చోట్ల అండర్ బ్రిడ్జిలు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా అన్ని నియోజకవర్గ కేంద్రాల నుంచి వైసిపి నాయకులు బైకులు, కార్లతో భారీ సంఖ్యలో ర్యాలీగా వచ్చారు.

పెడబ్ల్యు మార్కెట్‌లో కోలగట్ల ప్రచారం

విజయనగరం టౌన్ : నగరంలోని పిడబ్ల్యూ మార్కెట్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. మరోసారి తనకు శాసనసభ్యుడిగా అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కంటుభుక్త తవిటిరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి కాపుగంటి ప్రకాష్ మాట్లాడారు.

సరగడ రమేష్‌కుమార్
నెల్లిమర్ల నియోజకవర్గం

డోల శ్రీనివాసరావు
గజపతినగరం నియోజకవర్గం

ఎం.విద్యాసాగర్
బొబ్బిలి నియోజకవర్గం

మూడు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

బొబ్బిలి అభ్యర్థిగా ఎం.విద్యాసాగర్
గజపతినగరానికి డోల శ్రీనివాసరావు
నెల్లిమర్ల నుంచి రమేష్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో రెండుచోట్ల అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను మార్పు చేసింది. గజపతి నగరం నియోజకవర్గానికి మొదటి జాబితాలో అభ్యర్థిగా జి.కూర్మి నాయుడును ప్రకటించగా, ఆయనను మారుస్తూ రెండో జాబితాలో ఆ నియోజకవర్గం నుంచి విజయ నగరానికి చెందిన డోల శ్రీనివాస్ పేరును ప్రకటించింది. నెల్లిమర్ల అభ్యర్థిగా డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్‌ను ప్రకటించింది. ఈయన విజయనగరం పార్లమెంట్ స్థానం టిక్కెట్ వస్తుందని ఆశించినప్పటికీ నెల్లిమర్ల నుంచి అధిష్టానం పోటీలో దించింది. బొబ్బిలి అభ్యర్థిగా మరిపి విద్యాసాగర్ పేరును ప్రకటించింది. విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి బొబ్బిలి శ్రీనును అధిష్టానం ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆ ముగ్గురికీ చంద్రబాబు పిలుపు

సనేమిరా అన్న గీత
నేడు గజపతినగరంలో కలవనున్న నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని గజపతినగరం, చీపురుపల్లి, విజయనగరం నియోజకవర్గాల్లో టిడిపి టిక్కెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యేలు కెఎ నాయుడు, మీసాల గీత, చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జునకు పిలుపువచ్చింది. వీరికి టిక్కెట్ రాకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందారు. టిడిపి అభ్యర్థుల ప్రచారాలకు దూరంగా ఉన్నారు. విజయనగరంలో మీసాల గీత ఒకడుగు ముందుకు వేసి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ కూడా వేశారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యేకెఎ నాయుడు తన సొంత అన్నయ్య కొడుకు శ్రీనివాస్‌కు టిక్కెట్ వచ్చినప్పటికీ సహకరించడం లేదు. ఈనేపథ్యంలోనే జగన్ సమక్షంలో మంగళవారం వైసిపిలో చేరుతారంటూ వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఎస్.కోటలో ప్రజాగళం సభకు వచ్చిన చంద్రబాబునాయుడు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ద్వారా కెఎ నాయుడుకు, మీసాల గీతకు కబురు పంపారు. సోమవారం రాత్రి ఎస్.కోటలో తనను కలవాలని చెప్పడంతో గీత నిరాకరించారు. ఇప్పటికే తాను నామినేషన్ వేసినందున వెనక్కి తగ్గబోనని చెప్పినట్లు తెలిసింది. కెఎ నాయుడు మాత్రం చంద్రబాబును కలిశారు. చంద్రబాబు మరి ఎటువంటి హామీ ఇచ్చారో తెలియాల్సి ఉంది. చంద్రబాబు మాటకు విలువనిచ్చి కెఎ నాయుడు టిడిపిలో కొనసాగి అభ్యర్థికి శ్రీనివాస్‌కు సహకరిస్తే ఆ పార్టీలో మరింత జోష్ కనిపించనుంది. అయితే చంద్రబాబు చక్రం తిప్పుతారా? నాయుడును చేజార్చు కుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

నాగార్జునకు పిలుపు

చీపురుపల్లి : కిమిడి నాగార్జున తనను కలవాలని చంద్రబాబు నాయుడు నుంచి సోమవారం పిలుపు వచ్చినట్లు తెలిసింది. తనకు చీపురుపల్లి ఎంఎల్‌ఎ టిక్కెట్టు దక్కకపోవడంతో నాగార్జున పార్టీ పట్ల కినుకు వహించిన సంగతి తెలిసిందే. గత కొన్ని రోజుల నుండి నాగార్జున పార్టీ కార్యక్రమాలకు గాని, ఎన్నికల ప్రచారానికి గాని దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు వచ్చిన చంద్రబాబు నాయుడు తనను మంగళవారం కలవాలని నాగార్జునకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు చంద్రబాబునాయుడుని కలిసేందుకు గజపతినగరం వెళ్తున్నట్టు తెలిసింది.

రేపు ప్రజాగళం సభ

నేడు అదితి గజపతి నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం కలెక్టరేట్ జంక్షన్‌లో బుధవారం నిర్వహించు ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతి రాజు కోరారు. సాయంత్రం 5గంటలకు జరిగే ఈ సభలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. ఐవిపి రాజు గారు మాట్లాడుతూ అదితిగజపతిరాజు ఈనెల 24న నామినేషన్ వేస్తారని తెలిపారు. అశోక్‌బంగ్లా నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరి ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి నామినేషన్ దాఖలు చేయడానికి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తారని, ఈ నామినేషన్ కార్యక్రమం నిరాడంబరంగా నిర్వహిస్తామని తెలిపారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-చీపురుపల్లి

వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలోనికి 50 కుటుంబాలు చేరాయి. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేటకు చెందిన మీసాల హరికృష్ణ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు చేరాయి. వీరికి చీపురుపల్లి ఎంఎల్‌ఎ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు పార్టీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ గద్దే బాబూరావు, కిమిడి మల్లిక్ నాయుడు, రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, దన్నాన రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో తాగునీటి కూలింగ్ యంత్రం ఏర్పాటు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో కక్షిదారుల సౌకర్యార్థం న్యాయవాది జి.చిట్టిబాబు సంకల్పంతో ఏర్పాటు చేసిన మంచినీటి కూలింగ్ యంత్రాన్ని న్యాయమూర్తి కుమారి సబ్బువరపు వాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని చల్లని మంచినీరు కోసం ఖరీదైన యంత్రం ఏర్పాటు చేసిన న్యాయవాది చిట్టిబాబు, ఆర్థిక సహకారం అందజేసిన పలువురు న్యాయవాదులను అభినందించారు. అనంతరం పలువురు కక్షిదారులకు న్యాయమూర్తి వాణి స్వయంగా మంచినీటిని అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ కార్యదర్శి బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.అప్పారావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, లైబ్రరీ సెక్రటరీ ఆర్.సత్యనారాయణ, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్. శర్మ, న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.